

గిరిజనుల గోడు వినేవారేరి?



- జిల్లాలో ఎస్టీ సంక్షేమ శాఖకు కార్యాలయం కరువు
- జిల్లా ఏర్పడి 8 ఏళ్లయినా పట్టించుకోని పాలకులు
- ఇన్‌చార్జులతోనే సరిపెడుతున్న సర్కారు
- సమస్యలను విన్నవించుకునేందుకు గిరిజనుల తిప్పలు

"జిల్లాలో సుమారు 60 వేలకు పైగా గిరిజనులు ఉన్నారు. కాని వారి బాధలు చెప్పుకోవడానికి జిల్లాలో ఒక్క కార్యాలయం కూడా లేదు. వారికి ఏదైనా సమస్య వస్తే హనుమకొండకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా ఏర్పడి 8 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి పలు గిరిజన, గిరిజన విద్యార్థి సంఘాలు ఎస్టీ కార్యాలయం కోసం డిమాండ్ చేస్తున్నా అధికారులు మాత్రం శ్రద్ధ వహించడం లేదు. ఇప్పటికైనా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు స్పందించి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని గిరిపుత్రులు కోరుతున్నారు."


జనగామ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనుల సంక్షేమాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. వారి సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జనగామ జిల్లా ఏర్పడి 8 ఏళ్లవుతున్నా ఇంత వరకు జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దీంతో జిల్లాలో గిరిజనుల గోడు వినేవారు కరువయ్యారు. తమ సమ స్యలు చెప్పుకుందామంటే కనీసం ఒక్క అధి కారి కూడా లేడు. 8 ఏళ్లుగా హనుమకొండ జిల్లా గిరి జన సంక్షేమ అధికారికే జనగామ జిల్లా బాధ్యతలను కూడా అప్పగి స్తూ వస్తున్నారు. దీంతో గిరిజనులు ఏవైనా సమస్యలు ఉంటే హనుమకొండ వరకు వెళ్లాల్సి వస్తోంది.

ఎనిమిదేళ్లుగా దిక్కులేదు..

జిల్లా ఏర్పడి 8 ఏళ్లు అవుతున్నా ఇంతవరకు గిరిజ న సంక్షేమ శాఖ కార్యాలయాన్ని అధికారులు ఏర్పాటు చేయలేదు. జిల్లాలు ఏర్పడిన కొత్తలో తాత్కాలిక భవ నాల్లో జిల్లా కార్యాలయాలు కొనసాగాయి. ఆ తర్వాత 2022లో సమీకృత కలెక్టరేట్ ప్రారంభం అయింది. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులోని ఎఫ్-25 బ్లాక్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖకు కార్యాలయాలకు కేటాయించారు. మిగతా మూడు శాఖల కార్యాలయాలను అందులో ఏర్పాటు చేసుకోగా జిల్లా అధికారే లేకపోవడంతో ఎస్టీ సంక్షేమ శాఖ కా ర్యాలయం ఏర్పాటు కాలేదు. 8 ఏళ్లుగా పలు గిరిజ న, గిరిజన విద్యార్థి సంఘాలు ఎస్టీ కార్యాలయం ఏర్పాటు పై డిమాండ్లు చేస్తూ వస్తున్నా అధికారులు మాత్రం శ్రద్ధ వహించడం లేదు. జిల్లా వ్యాప్తంగా గిరిజనుల జ నాభా చాలా ఎక్కువగా ఉంటుంది. జిల్లాలోని 12 మం డలాల పరిధిలో 60 వేలకు పైగా గిరిజన జనాభా ఉం ది. కాని వారి సమస్య వినడానికి మాత్రం ఒక్క అధికా రి కూడా లేకపోవడం గిరిజనుల పట్ల అధికారులకు ఉన్న పట్టింపులేని తనానికి నిదర్శనంగా నిలుస్తోంది.

సమస్యలుంటే హనుమకొండకు..

జిల్లాలో ఎస్టీ సంక్షేమ శాఖ కార్యాలయం గానీ, అధి కారి గానీ లేకపోవడంతో గిరిజనులు తమ సమస్యలు చెప్పుకునేందుకు హనుమకొండకు వెళ్లాల్సి వస్తోంది. జనగామ జిల్లాకు అధికారి లేకపోవడంతో హనుమకొండ జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారికే అదనపు బాధ్యతలు ఇచ్చారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం హనుమకొండకు వెళ్లక తప్పని పరస్థితి ఏర్పడింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యల విషయంలో విద్యార్థులు, గిరిజనులకు ప్రభుత్వం అందించే ట్రైకార్ రుణాలకు సంబంధించి దరఖాస్తులు, తదితర సమస్యల పరిష్కారం కోసం గిరిజనులకు నిత్యం ఎస్టీ సంక్షేమ శాఖ అధికారితో పని ఉంటుంది. అయితే హనుమకొండ వరకు వెళ్లలేని గిరిజనుల్లోని నిరక్షరాస్యులు, వృద్ధులు జనగామ కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణితో వినతులు ఇచ్చి వెళ్తున్నారు. ఈ వినతులను హనుమకొండ జిల్లా అధికారికి పరిష్కారం కోసం కలెక్టర్ పంపిస్తున్నారు. వాటిలో చాలా వరకు పరి ష్కారానికి నోచుకోవడం లేదు. తాము ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తు స్థితి ఏంటో తెలుసుకుందామంటే మళ్లీ హనుమకొండ కార్యాలయానికే వెళ్లాల్సి వస్తోంద ని గిరిజనులు వాపోతున్నారు.



కలెక్టరేట్‌లో ఇలా బోర్డు పెట్టారు తప్ప కార్యాలయం ఏర్పాటు చేయలేదు

ప్రభుత్వ పరిధిలోని అంశం

- ప్రేమకళ, జిల్లా ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ శాఖ అధికారి, జనగామ

జనగామతో పాటు గతంలో కొత్తగా ఏర్పడిన కొన్ని జిల్లాల్లో ఎస్టీ కార్యాలయం ఏర్పాటు కోసం 2016లో గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రతి పాదనలు వెళ్లాయి. కార్యాలయం ఏర్పాటులో భాగంగా అవసరమయ్యే జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్లు తదితర సిబ్బంది అవసరం ఉంటుంది. దీనికి సం బంధించి పంపించిన ప్రతిపాదనలకు ఫైనాన్స్ క్లియ రెన్స్ రావాల్సి ఉంది. ఆ అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది.

ఏళ్ల తరబడి అడుగుతున్నాం..

- బానోత్ ధర్మభిక్షం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ 8 ఏళ్లుగా అడుగుతూనే ఉన్నాం. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో సుమారు 60 వేలకు పైగా గిరిజన జనాభా ఉంది. ఇంత పెద్ద మొత్తంలో జనాభా ఉన్న సామాజిక వర్గానికి కార్యాలయం లేకపోవడం శోచనీయం. జిల్లాలో కార్యాలయం గానీ, కనీసం ఒక్క అధికారి గానీ లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం హనుమకొండకు వెళ్లాల్సి వస్తోంది. ఎస్టీ సంక్షేమ శాఖ కార్యాలయం ఏర్పాటుపై అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

దుర్గామాత ఆలయంలో 'కొండా' పూజలు

అమ్మవారికి రూ.8 లక్షల విలువైన ఆభరణాల సమర్పణ


అమ్మవారికి బంగారు ఆభరణాలను సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

చిలుపూర్, ఆగస్టు 25: శ్రీపతిపల్లిలో గల విష్ణుదుర్గామాత ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆదివారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి రూ.8 లక్షల విలువ గల ఆభరణాల (బంగారు హారం, చెవి కమ్మలు, పుస్తెలతో పాటు, డైమండ్ ముక్కు పుడక)ను సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న కొండా మురళికి స్థానిక బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, విష్ణుదుర్గా ఆలయ కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ళు, కోలాట కళాకారుల నృత్యాలు, డీజే చప్పుళ్ల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ గతంలో గ్రామంలో జరిగిన కొండా సినిమా చిత్రీకరణ సమయంలో ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి బంగారు ఆభరణాలు చేయిస్తానని మొక్కుకున్నానని గుర్తు చేశారు. కాగా, ఇటీవల గ్రామంలో నెలకొన్న వివాదంపై కొండా స్పందించారు. తనపై స్థానిక ఎమ్మెల్యే కడియం ఒత్తిడి ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గ్రామాన్ని సందర్శించారు. విష్ణుదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూష -మనోజ్‌రెడ్డి, జనగామ యాదగిరి, కంకటి రవిందర్, ఉడుద వెంకన్న, రంగు హరీష్, కొయ్యడ రాందాస్, గొంగిడి కృష్ణమూర్తి, కావటి రాజు, మాలోతు రమేష్‌నాయక్, టి. సురేశ్, గోవిందు అశోక్, కనకం గణేశ్, చల్ల చందర్ రెడ్డి, లోడెం రవిందర్, మాచెర్ల గణేశ్, మాతంగి దేవయ్య బాలరాజు, మోతె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


సీతారాంపురంలో బోనంతో ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల, ఆగస్టు 25: మండలంలోని సీతారాంపురంలో ఆదివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి బోనమెత్తుకున్నారు. బొడ్రాయి నుంచి పోచమ్మ ఆలయం వరకు మహిళలతో కలిసి నడిచారు. పోచమ్మ దేవతకు చీరె, సారె సమర్పించారు. వారం రోజుల క్రితం ఆమె రూ.5లక్షలు కేటాయించి పోచమ్మ ఆలయం చుట్టూ సీసీ వేయించి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని తల్లిని వేడుకున్నారు. అంతకు ముందు కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు ఉప్పుల సురేష్‌బాబు, రెడ్డిరాజుల రమేష్, సురంజన్‌రెడ్డి, యాకస్వామి, రాంరెడ్డి, బస్వ సోమయ్య, బస్వ నర్సయ్య, వరికెల రతన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీ పేరుతో తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గాయత్రి ట్రస్టు, అనురాగ్ సంస్థలు నాదం చెరువు యొక్క బఫర్ జోన్‌లో నిర్మిస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఇంజనీరు ఫిర్యాదు ఇవ్వడం, కనీస సమాచారం కూడా లేకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణం జరిగిన భూమి ఎఫ్‌టీఎల్‌లో కానీ, బఫర్ జోన్‌లో కానీ లేదన్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలో ఉన్న ఈ నిర్మాణాలు అన్ని అనుమతులతో, కావాల్సిన సెట్ బ్యాక్స్ వదిలిపెట్టి చేశామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యక్తిగతంగా తనపై ఎన్నికలైన తర్వాత జనగామలో నాలుగు కేసులు, హైదరాబాద్‌లో రెండు కేసులు నమోదు చేశారన్నారు. కక్షపూరితంగా ఈ ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా చట్ట ప్రకారమే నడుచుకుంటానన్నారు. చట్టానికి లోబడి అన్ని అనుమతులు తెచ్చుకున్నానని, 25 సంవత్సరాల అనురాగ్ సంస్థల ప్రస్థానంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యాబోధన కొనసాగిస్తామన్నారు. అదే విధంగా తనను ఎన్నుకున్న జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ హాస్పిటల్ ద్వారా నిత్యం ఉచిత వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. భారత న్యాయ వ్యవస్థపై అపార నమ్మకంతో చట్ట పరిధిలోనే న్యాయం కోసం పోరాడతానన్నారు.

ప్రశ్నిస్తున్నందుకే పల్లాపై కక్ష..

బచ్చన్నపేట: ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల పక్షాన పోరాడుతున్న పల్లాపై కక్షగట్టి విద్యాసంస్థలను నిర్వీర్యం చేయాలనే కుట్రలకు తెరలేపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగా వెళితే కాంగ్రెస్ నేతలు ఎక్కడ ఉండేవారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.

ప్రజల కోసం ప్రభుత్వంతో పోరాడతాం

- హైడ్రా నుంచి సామాన్యులకు విముక్తి కల్పించాలి
- పార్టీ ఫిరాయిస్తే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బాలసముద్రం, ఆగస్టు 25: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మిత్ర పక్షంగా ఉంటూనే ప్రజల సమస్యల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని నల్లగొండ, ఖమ్మంలో ఎక్కువ సీట్లు గెలుపొందిందన్నారు. కానీ సీపీఐతో మిత్ర బంధం పాటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎక్కువ హామీలు ఇచ్చి పట్టించుకోవడంలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. మంత్రుల మధ్య సమన్వయ లోపంతో ఒకరు చెప్పిన మాటకు మరొకరు చెప్పిందానికి సంబంధం ఉండడంలేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకపోయినా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై రాళ్లు వేస్తున్నారని అన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని, లేకుంటే రైతులు రుణమాఫీపై రైతులు ధర్నాలు చేస్తే సీపీఐ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సామన్య ప్రజలు భయపడుతున్నట్లు, హైడ్రా నుంచి సామాన్యులకు విముక్తి కల్పించాలని సాంబశివరావు సూచించారు.

బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ వీడేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రస్తుత విలువలు లేని రాజకీయాలు ఎవరు చేసినా మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలపై చర్యలు ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులకు పాల్పడితే సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రంలో రూ.70వేల కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నాయని అన్నారు. ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గడిచిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలపై జరిగే చర్చకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుపడినట్లు తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు జుగుప్సాకరమైన పద జాలం ఉపయోగించడం మంచి పరిణామం కాదని, గతంలో బీఆర్ఎస్ తప్పులు చేయడం వల్లే ప్రజలు తిరస్కరించినట్లు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సెప్టెంబరు 17న తెలంగాణ సాయుధపోరాట అమరవీరుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కూనంనేని సాంబశివరావు కోరారు. సినీ నటుడు నాగార్జున ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇంటి నిర్మాణాలు చేస్తే కూలగొడితే మంచిదే కానీ.. గూడు లేని పేదల ఇండ్లు కూల్చవద్దని అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాలు చేస్తే అక్రమాలను బయటకు తీయాలని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. కాగా, హనుమకొండలో గురువారం నుంచి శనివారం వరకు సీపీఐ మూడురోజులు రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు నిర్వహించి జాతీయ నాయకుల సూచనలతో పలు తీర్మానాలు చేసినట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో ఘనంగా బోనాల జాతర - 8లో

అర్హత లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ



ప్రజలకు సూచనలు ఇస్తున్న ఏసీపీ భీమ్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 25: సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ హెచ్చరించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పలు కాలనీలలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని వడపోశారు. కిరాణం, పాన్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వద్ద ఉన్న బైక్‌లకు సంబంధించి ధ్రువ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రజలకు పలు సూచనలు చేశారు. సెల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దు అని, వాట్సాప్‌లలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దు అని సూచించారు. అనుకోకుండా ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కితే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు వినియోగిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దు అని సూచించారు. ప్రతీ వీధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు జి.వేణు, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు శ్రవణ్‌కుమార్, నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూకంపం సృష్టించైనా బీసీల రిజర్వేషన్లు సాధిస్తాం

- సీఎం పీఠంపై బీసీలు కూర్చోవాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- కాజీపేటలో బీసీల సమర శంఖారావం


'బీసీ వాదం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజీపేట, ఆగస్టు 25: బీసీలకు దామాషా ప్రకారం అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే భూకంపం సృష్టిస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. రాబోయేది బీసీల సర్కారేనని, బీసీలు సీఎం పీఠంపై కూర్చోవాల్సిందేనని అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీసీల సమర శంఖారావం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముందు బీపీ మండల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 'సామాజిక న్యాయమే.. బీసీ నాదము - బీసీ వాదము' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ 'కుడా' చైర్మన్ సుందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై తీన్మార్ మల్లన్న మాట్లాడారు.

బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. ఈ మేరకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తన మాటను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలో కుక్కలు, పందులు ఎన్నున్నాయో లెక్కుంది కానీ.. బీసీలు ఎంతమంది ఉన్నారో లెక్క లేదని వ్యాఖ్యానించారు. మీరు లెక్కకడుతారా.. మేమే మిమ్మల్ని లెక్కకట్టాలా.. అని అగ్రకులాలనుద్దేశించి అన్నారు. బీసీలకు న్యాయం జరిగేంతవరకు తాను మాట్లాడుతూనే ఉంటానన్నారు. బీసీల న్యాయం కోసం అవసరమైతే కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. యుద్ధం ప్రారంభమైందని, ఇది తీన్మార్ మల్లన్న అంతిమయాత్ర వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో 60 శాతం మంది బీసీలుంటే.. ఆరుగురికి మాత్రమే మంత్రి పదవులు వచ్చాయన్నారు. బీసీల పక్షాన రెడ్డి, వెలమ, బ్రహ్మణుల మద్దతు తీసుకుంటామని, ఇది పోరాటాల గడ్డ వరంగల్ నుంచే పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తనకు వచ్చిన పదవి బిచ్చమెత్తి తెచ్చుకోలేదని, బెదిరించి తెచ్చుకున్నానని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు.

అంతకుముందు బీపీ మండల్ మనవడు సూరజ్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీల సర్కార్ రావాలన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో రెడ్డిలే ముఖ్యమంత్రులవుతున్నారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ... బీసీ ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. ఓరుగల్లు అంటేనే ఉద్యమాల ఖిల్లా అని, ఉద్యమం ఇక్కడినుంచే ప్రారంభం కావాలన్నారు. పిడికెడు మందితో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంతో రాష్ట్రాన్ని సాధించామని, అలాగే బీసీల ఉద్యమం కూడా విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, క్రాంతి, సుశీల, ఎల్లావుల లలితా యాదవ్, ఈగ మల్లేశం, డా. వినయ్‌తో పాటు బీసీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఔషధ గుణాల గాడిద పాలు

● 10 మి.మీ. రూ.100కు అమ్మకం ● ఇంటి వద్దకే విక్రయాలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 25: గాడిద పాలను చిన్నారులకు తాగించేందుకు నగరవాసులు అమితాసక్తిని కనబర్చుతున్నారు. పలు ఔషధ గుణాల కలిగిన గాడిద పాలను చిన్నారులకు తాగించడం ద్వారా జన్యు పరమైన లోపాలు, అనారోగ్య సమస్యలు దూరం చేస్తూ ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ప్రచారంలో ఉంది. కేవలం 10 మిల్లీలీటర్ల గాడిద పాలకు రూ.100 తీసుకుంటున్నారు. అక్కడే పిండి విక్రయాలు చేస్తున్నారు. పాల ఖరీదు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. హనుమకొండలో కొందరు వీధి వీధికీ గాడిదలను తిప్పుతూ ఇళ్ల వద్దకే వచ్చి అక్కడే పాలను పిండి విక్రయిస్తున్నారు.

జీవనాధారం

తాతలు, తండ్రి వారసత్వంగా గాడిదలను పెంచి పాలను విక్రయిస్తూ దాదాపు 15ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నట్లు గాడిద పాల విక్రయదారుడు జమ్మికుంటకు చెందిన కోట రవి అనే వ్యక్తి చెబుతున్నాడు. రోజంతా నగరంలోని పలు కాలనీలలో మైకులో ద్వారా ప్రచారం చేస్తూ గాడిద పాల విక్రయిస్తున్నా మన్నారు. రోజుకు సుమారు రూ.800 నుంచి రూ.1000 రాగా, అందులో నుంచి గాడిద దాణాకు రూ.300 వరకు ఖర్చులు పోగా.. మిగిలిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపాడు. ఇటీవల కాలంలో చాలాచోట్ల కొందరు గాడిదల ఫామ్‌లు పెట్టి పాల విక్రయాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారని చెప్పారు.


గాడిద పాలు విక్రయిస్తున్న దృశ్యం


బొడ్రాయి కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణిదేవి, ప్రముఖులు

రచయితలే సమాజాన్ని చైతన్యం చేసేది

బొడ్రాయి కథా సంపుటి ఆవిష్కరణలో ఎమ్మెల్సీ వాణిదేవి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25: సమాజాన్ని చైతన్య వంతం చేసే బాధ్యత ముమ్మాటికీ రచయితలదేనని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, ఉపాధ్యాయురాలు, రచయిత్రి రావుల కిరణ్మయి కలం నుంచి జాలువారిన బొడ్రాయి కథా సంపుటితో పాటు పీవీ నర్సింహారావు ఉయ్యాల పాట గ్రథాలను ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ.. పాట రూపంలో పీవీ చరిత్ర రాయడం గొప్ప ప్రయోగమని పేర్కొన్నారు. కవులు, రచయితలు సమాజ పక్ష సాహిత్యాన్ని సృజింప చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. రియాజ్ మాట్లాడుతూ.. కిరణ్మయి కథలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయన్నారు. పీవీ ప్రపంచ ఆస్తి అని, ఎంత సాహిత్యం సృజించినా తక్కువేనన్నారు. పల్లె జీవితంపై తెలంగాణ భాష, యాసపై పట్టుతో మంచి గ్రంథాలు వెలువరించిన రాధాకృష్ణ సాహితీ వేదికను ప్రశంసించారు. డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, జానపద విజ్ఞాన శాస్త్ర వేత్త ఆచార్య ఎన్. భక్తవత్సల్‌రెడ్డి, రావుల పుల్లాచారి, డాక్టర్ గడ్డం వెంకన్న, ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ గ్రంథాలను బీవీఎన్ స్వామి, మెరుగు అనురాధ తమదైన శైలిలో అద్భుతంగా సమీక్షించారు. కళా రాజేశ్వర్‌రావు, బిల్ల మహేందర్, పీవీ మదన్‌మోహన్, బాలబోయిన రమాదేవి, కానుగుల భద్రయ్య, గుండు రవి, తదితర అనేక మంది భాషా పండితులు పాల్గొన్నారు.

కొత్తకొండ దేవాలయ ముఖ్య అర్చకుడికి స్వర్ణకంకణం ప్రదానం

భీమదేవరపల్లి, ఆగస్టు 25 : మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయ ముఖ్య అర్చకుడు మొగిలిపాలెం రాంబాబు దంపతులకు తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు జాతీయ కార్యదర్శి దైవజ్ఞశర్మ స్వర్ణకంకణంతో పాటు అవార్డును ఆదివారం అందజేశారు. తెలంగాణ నుంచి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా పనిచేస్తున్న రాంబాబును ఎంపిక చేశారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో నక్షత్ర దీక్షలు ప్రారంభించి పలువురు భక్తులకు వీరభద్రస్వామి మాలలను గత 20 ఏళ్ల నుంచి రాంబాబు చేస్తున్నాడు. దీనికి గుర్తింపుగా మొగిలిపాలెం రాంబాబు ధర్మపత్ని లలితాదేవిలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఘనంగా సన్మానించి స్వర్ణకంకణాన్ని ప్రదానం చేశారు. అనంతరం మొగిలిపాలెం రాంబాబు-లలితాదేవి దంపతులను హైద్రాబాద్‌లోని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తమ ఇంటికి రప్పించి ఘనంగా సన్మానించారు.


రాంబాబుకు స్వర్ణకంకణం తొడుగుతున్న నిర్వాహకులు

ఐకార్ గుర్తింపు ఎస్సార్‌యూ సన్నద్ధం

హసన్‌పర్తి, ఆగస్టు 25: మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల ఐకార్ గుర్తింపు కోసం సన్నద్ధమైనట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ వ్యవసాయ కళాశాల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు కనీసం మొదటి బ్యాచ్ విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు విజయవంతంగా డిగ్రీలు పొందడంతో ఐకార్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన ప్రమాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కళాశాలలో విభాగాల వారీగా బోధనా, బోధనేతర సిబ్బంది, ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రదర్శన కృషి ఫారమ్ సౌకర్యాలున్నాయని తెలిపారు. ఇవి డీన్స్ కమిటీ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి మార్గదర్శకాలతో అనుగుణంగా ఉన్నాయన్నారు. ఐకార్ గుర్తింపు పొందడానికి అన్ని అర్హతలున్నాయని, ఈగుర్తింపు ద్వారా విద్యా ప్రమాణాలు మరింత బలపడి వ్యవసాయరంగానికి విశేష కృషి చేసేలా కళాశాల సన్నద్ధమవుతుందని తెలిపారు.

ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రవికుమార్

వడ్డెపల్లి, ఆగస్టు 25 : ఆటో డ్రైవర్ల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక ఆటో డ్రైవర్ల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జాక్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గుడిమళ్ల రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ఆరులక్షల మంది ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకునేందు కోసం తక్షణమే ప్రతీ ఆటో డ్రైవర్‌కు ప్రతీ ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జీవిత బీమా ప్రభుత్వమే కల్పించడంతో పాటు ఆటో రిక్షాలపై ట్రాఫిక్, ఫెనాల్టీని వెంటనే నిలిపివేయాలని అన్నారు. ఆటోడ్రైవర్లపై ఫైనాన్షియర్ల దాడులను అరికట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో టీఏడీయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘం మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అబీబ్, జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు జేరిపోతుల కుమార్, శానబోయిన రాజ్‌కుమార్, మోడెం విద్యాసాగర్, దార మధు, చల్ల విక్రమ్, కట్ట రాంకుమార్, అకినపల్లి అంజయ్య, మర్రి కృష్ణ, మద్దెల రాజేందర్, ఆవుల నవీన్, పిల్లి ఆనంద్, మాతంగి శివరాజ్, ఆమంచ ప్రశాంత్ , ఆకుల వెంకటేశ్వర్లు, గుండాల రాజు, పెసరు శివ పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లి వానరం

మృతి చెందిన పిల్ల బతుకుతుందేమోనని తాపత్రయం

కేసముద్రం, ఆగస్టు 25: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ రెండో గేటు వద్ద ఆదివారం ఉదయం ఒక తల్లి కోతి అప్పటికే మృతి చెందిన తన పిల్లను తీసుకుని వచ్చింది. పిల్లవానరం ఎలా చనిపోయిందోగాని తన పిల్ల ఎప్పటికైనా లేస్తుందేమోనని తపనతో తల్లి వానరం దాని కళేబరాన్ని తన వెంటనే తీసుకువెళుతోంది. కొద్దిసేపు గేటు వద్ద కళేబరాన్ని ఉంచి పలుమార్లు తట్టి లేపుతూ దీనంగా అరుస్తుండడంతో చూపరులు అయ్యో పాపం అంటూ చలించిపోయారు.


చనిపోయిన పిల్లను లేపుతున్న తల్లి వానరం



బీపీ మండల్‌కు నివాళులర్పిస్తున్న విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగులు

విద్యుత్‌శాఖలోని పదోన్నతులు చట్టవిరుద్ధం

హనుమకొండ టౌన్, ఆగస్టు 25: ఇటీవల విద్యుత్‌శాఖలో చేపట్టిన పదోన్నతులు చట్టవిరుద్ధమని, దీనిపై కోర్టులో సవాల్ చేస్తామని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీజీఎస్పీడీసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి పేర్కొన్నారు. బీసీ ఉద్యోగుల కార్యనిర్వాహక సమావేశం ఆదివారం హనుమకొండలో జరిగింది. ఈ సందర్భంగా బీ.పి మండల్ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా డిస్కంలు వ్యవహరించాయన్నారు. పదోన్నతులను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 4 న హైద్రాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట మహాధర్నా చేయబోతున్నామని, బీసీ ఉద్యోగులంతా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు నాగెల్లి సదానందం, నీలారపు రాజేందర్, రిటైర్డ్ సీఈ సత్యనారాయణ, కంపెనీ పరిధిలోని 16 జిల్లాల అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ఉన్నతాధికారులు



అమ్మవారిని దర్శించుకున్న ఇరిగేషన్ శాఖ అధికారి కె. ధర్మ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 25: భద్రకాళి అమ్మవారిని ఆదివారం అధికారులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఆదాయపు పన్ను శాఖ అధికారి ఆనంద రాజేశ్వర్ దంపతులు, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.ధర్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వీరికి ఆలయ ఈవో శేషభారతి వీరికి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అయ్ బాబోయ్ ఎంత పొడుగో!

స్టేషన్‌ఘన్‌పూర్‌లో 20 అడుగులు పెరిగిన పచ్చజొన్న కర్రలు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 25: సాధారణంగా పచ్చజొన్న కర్రలు ఐదు లేదా ఆరు అడుగులు పెరుగుతాయి. కాని దానికి మూడింతలు ఎత్తు పెరిగిన మొక్కలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలో మాజీ ఎంపీటీసీ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జోగు కుమారస్వామి ఇంటి ఆవరణలో ఈ వింత మొక్కలు పెరిగాయి. రెండు నెలల క్రితం మూడు పచ్చ జొన్న మొక్కలు వాటికి అవే మొలకెత్తాయి. రోజు రోజుకూ అవి ఎదుగుతూ 20 నుంచి 22 అడుగులకు చేరుకున్నాయి. వాటిని చూసిన స్థానికులు ఇంత ఎత్తు ఎలా పెరిగాయని ఆశ్చర్యపోతున్నారు. కాగా భూమిలో ఉన్న సారం ప్రకారం అప్పుడప్పుడు ఇలా ఎత్తు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. కాగా, అవి అంత ఎత్తు పెరిగినా ఇంతవరకు కంకి వేయకపోవడం గమనార్హం.



కాజీపేట ఐటీఐ ఏటీసీ కోసం సోమిడిలో కేటాయించిన స్థలం



వాజేడులోని ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ఐటీఐలకు అధునాతన హంగులు

ఏటీసీల ఏర్పాటుకు మొదలైన భవన నిర్మాణ పనులు ● ఉమ్మడి జిల్లాలో తొలి విడత మూడు ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటు

ఒక్కొక్క దాని వ్యయం రూ.40 కోట్లు ● ఐటీఐలకు చేరుకుంటున్న ఏటీసీ ఏక్విప్‌మెంట్

హనుమకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడివరంగల్ జిల్లాలోని మూడు పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటీఐ)లలో ఆధునాతన సాంకేతిక శిక్షణా కేంద్రాల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా 24 ఐటీఐలలో ఏటీసీ భవనాల నిర్మాణం పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ, భూపాలపల్లి ఐటీఐ, ఏటూరునాగారం ఐటీలలో పనులు మొదలయ్యాయి. ఈఐటీఐలలో చాలినంత స్థలం అందుబాటులో ఉండడంతో వీటిల్లో ఏటీసీ భవనాల నిర్మానానికి శ్రీకారం చుట్టారు. మిగతా మూడు ఐటీఐలలో కూడా స్థలం అందుబాటులోకి రాగానే పనులు చేపడతారు. వర్షాకాలం కావడం వల్ల ఈ మూడు ఐటీఐలలో పనులకు కొంత ఆటంకం కలుగుతోంది. పిల్లర్ల కోసం తవ్విన కందకాలతో వర్షపు నీరు తరుచూ నిండిపోయి పనులు ముందుకు సాగడం లేదు. ఆరు నెలల్లో భవనాల నిర్మాణం పూర్తయితే ఆ వెంటనే అందుల్లో పరికరాలను అమర్చుతారు. వాస్తవానికి ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ ఏటీసీలలో ప్రవేశాలను కల్పించాల్సి ఉంది. కానీ భవనాల నిర్మాణమే పూర్తికాకపోవడంతో వాయిదా పడింది. ఈలోగా ఏటీసీ ఏర్పాటును పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రవేశాలను కల్పించనున్నారు.

అధునాతన..

ఐటీలను ఆధునాతన సాంకేతిక శిక్షణా సంస్థలుగా (ఏటీసీ) మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది తెలిసిందే. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీ లిమిటెడ్‌తో (టీటీఎల్) ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వాటి దశ, దిశ మారనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐలో ఏసీటీలను ఏర్పాటు చేయాలని టీటీఎల్ నిర్ణయం తీసుకున్నది.



ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ భవన నిర్మాణానికి పిల్లర్ల కోసం తీసిన గుంతలు

మొదటి విడతగా 24 ఐటీలను ఏటీసీలను ఏర్పాటు చేయనున్నది. ఇందులోభాగంగా ఉమ్మడి వరంగల్‌లోని మూడు ఐటీఐలో ఏసీటీసీలు ఏర్పాటవుతున్నాయి. టీటీఎల్ ఒక్కొక్క ఏటీసీని రూ. 40కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. టీటీఎల్ మొత్తం రూ.2,324 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ఐటీఐలను అప్ గ్రేడ్ చేస్తోంది. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగంగా ఈ ఐటీఐలలో ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తారు. ఇందులో కోసం అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

చేరుకుంటున్న పరికరాలు

ఒక పక్క భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే టీటీఎల్ ఏటీసీలో అమర్చాల్సి ఉన్న యంత్ర పరికాలను ఆయా ఐటీఐలకు పంపడం మొదలు పెట్టింది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్)కు సంబంధించిన రోబోటిక్స్ మిషన్స్, డిజిటల్ కటింగ్స్ తదితర పరికరాలు వీటిలో ఉన్నాయి. వీటితో పాటు ఏటీసీలో ఒక ఆధునాతన అడ్వాన్సుడ్ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఇందులో 20 సిస్టమ్స్ ఉంటాయి. ఆటోమొబైల్‌కు కోర్సుకు సంబంధించి బ్యాటరీ చార్జెస్ వెహికిల్ కూడా రానున్నది.

సోమిడిలో ఏటీసీ

కాజీపేటలోని ఐటీఐకి అనుబంధంగా కూడా ఒక ఏటీసీ సెంటర్ ఏర్పాటు కానున్నది. అయితే ఇందులో చాలినంత స్థలం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ పనులు వెంటనే ప్రారంభం కాలేదు. స్థలం కోసం నాలుగైదు చోట్ల పరిశీలించగా చివరికి సోమిడిలో గోదాముల వెనుక గల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. ఏటీసీ ఏర్పాటుకు 25 గుంటల స్థలాన్ని హనుమకొండ కలక్టర్ ప్రావీణ్య ఇటీవల కేటాయించారు. స్థలం అప్పగించే ప్రక్రియ పూర్తికాగానే ఇక్కడ కూడా ఏటీసీ భవనం పనులు మొదలుకానున్నాయి.

ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు

ఐటీఐ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి అవకాశాలు పొందగలిగేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా భాగంగా ఐటీఐ సర్కిల్ డెవప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగస్వామి అయింది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా. ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తి నిపుణులను తయారు చేయడానికి ఆరు ఆధునాతన ట్రేడ్‌లను ఈ ఏసీటీల్లో ప్రవేశపెట్టనున్నది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్‌లో ఒక్కొక దానిలో 40 సీట్లు, మిగతా కోర్సుల్లో 48 సీట్ల చొప్పున ఉంటాయి. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఒక్కోక్కదాని రూ. 4.50 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా రూ. 35 కోట్లతో ఏటీసీల్లో ఆధునాతన బోధనా పరికరాలను సమకూరుస్తున్నది.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావు

సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కర్రె భిక్షపతి

ప్రకటించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



కర్రె భిక్షపతి

బాలసముద్రం, ఆగస్టు 25: తెలంగాణ కమ్యూనిస్టు రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో మూడు రోజులు అట్టహాసంగా జరిగాయి. ఆదివారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఎన్నుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ప్రకటించారు. రాష్ట్ర సీపీఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సీపీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ.. తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లో చేరి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, ఢిల్లీ కేంద్రంగా జాతీయ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు జాతీయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, రాష్ట్ర నాయకులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, బాగం హేమంతరావు, కలవేణ శంకర్, బాలనర్సింహా పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఐనవోలు, ఆగస్టు 25: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేవారికి డాక్టరేట్ బిరుదును అందజేస్తారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈవో, కుటుంబ సభ్యులను సన్మానించి బిరుదు పత్రాన్ని దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలలో సాంస్కృతిక సాహితి సేవా ట్రస్ట్ సేవా కార్యక్రమాలను నిర్వహించే వారిని ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఈవో సందర్భంగా పేర్కొన్నారు.

నర్సంపేటలో దొంగల హల్‌చల్

● తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ ● రూ. 12లక్షల నగదు, 11తులాల బంగారు నగల అపహరణ



నర్సంపేటలో చోరీకి పాల్పడిన ఇల్లు ఇదే..



ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, సీఐ రమణమూర్తి

నర్సంపేట టౌన్, ఆగస్టు 25 : నర్సంపేట పట్టణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదు, బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లిన ఘటన పట్టణంలో చోటచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం. నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామంలోని కాకతీయ గురుకుల పాఠశాల కరస్పాండెంట్ మేడవరపు కమలాకర్‌రావు తన కుటుంబంతో నర్సంపేటలోని వరంగల్ రోడ్‌లో వివేకానందకాలనీలో నివాసముంటున్నారు. కమలాకర్‌రావు భార్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో తన కుమారుడి వద్ద ఉంటూ చికిత్స పొందుతోంది. కమలాకర్‌రావు తన సహచర ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో పాఠశాల తరఫున సన్మాన కార్యక్రమం ఉండడంతో శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇదే రోజు అర్ధరాత్రి ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం సెంట్రల్ తాళం పగలగొట్టి ఉండడం, లోపలకి వెళ్లగా కప్‌బోర్డు తెరిచి ఉండి, అందులోని నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం చోరీ విషయాన్ని నర్సంపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ రమణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం వరంగల్ నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి దొంగతనం జరిగిన ఇంటితో పాటు పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చోరీలో రూ. 12 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు కమలాకర్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు.

సందడిగా జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఉమ్మడి జిల్లాలో 50మంది బాలబాలికలు హాజరు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 25: తెలంగాణ చెస్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని రోజరీ పాఠశాలలో జిల్లా స్థాయి అండర్-9 బాల బాలికల చెస్ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి క్రీడా పోటీల నిర్వాహణ కార్యదర్శి కన్న ముఖ్య అతిథిగా హాజరై చెస్ క్రీడలను లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడలో పాల్గొనడం ద్వారా మేధో సంపత్తి పెంపొందుతుందన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆశాభవం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలలో సుమారు 50మంది బాల బాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సెప్టెంబరు నెల చివరి వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సునీల్‌రెడ్డి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి చెస్ పోటీలను ప్రారంభిస్తున్న క్రీడల కార్యనిర్వాహణ కార్యదర్శి కన్న

మామిడాల కుశాల్‌కు మహా నంది పురస్కారం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25: హనుమకొండలోని రాయపుర ప్రాంతానికి చెందిన మామిడాల కుశాల్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలుగు సంస్కృతి సాహితీసేవా ట్రస్టు ఆధ్వర్యంలోనిర్వహించిన కార్యక్రమంలో మహా నంది పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.


ఆ పత్రికకు 102 ఏళ్లు



నిజాం నిర్బంధకాలంలో ప్రజలను చైతన్యపరిచిన 'తెనుగు' పత్రిక

మారుమూల గ్రామంలో పత్రిక స్థాపించిన ఒద్దిరాజు సోదరులు

రేపు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు



పత్రిక వ్యవస్థాపకులు ఒద్దిరాజు సోదరులు



ఇనుగుర్తిలోని ఈ ఇంటి నుంచే తెనుగు పత్రిక వెలువడింది

మహబూబాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిజాం ప్రభుత్వం నిర్బంధం కొనసాగిస్తున్న కాలంలో ప్రజలను చైతన్య పరిచి.. స్వాతంత్రోద్యమ వైపు నడిపించి, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అణిచివేయబడ్డ తెలంగాణ ప్రజలను మెల్కోలిపేందుకు ఒద్దిరాజు సీతారామచందర్‌రావు, రాఘవరంగారావు సోదరులు నడుం బిగించారు. సహజమైన కవులు, రచయితలు కావడం చేత ఆ కాలంలోనే జర్నలిస్టులుగా మారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారు మూల గ్రామమైన ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గ్రామంలో మద్రాసు నుంచి ముద్రణాలయం (ప్రింటింగ్ మిషన్) తెప్పించి, 'తెనుగు' పత్రికకు పురుడు పోశారు. ఆ పత్రిక ద్వారా ప్రజలను చైతన్య పరిచి తెలంగాణ ఉద్యమం వైపుకు నడిపించడంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణలోనే మొట్టమొదటి తెలుగు పత్రిక తెనుగు పత్రిక స్థాపించి ఈ నెలతో 102 ఏళ్ల పూర్తి కావొస్తుంది. తన కలాన్ని పదును పెట్టి తెలంగాణ ప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు పత్రికను పంపించి ప్రజలను చైతన్య పరిచారు. ఈ పత్రిక స్థాపించి వందేళ్ల పూర్తయిన నేపథ్యంలో ఒద్దిరాజు సోదరుల కుటుంబసభ్యులు, బంధువులు, ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 27న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ప్రముఖ పాత్రికేయులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆ తెనుగు పత్రికపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

'తెనుగు' పత్రికకు శ్రీకారం..

నిజాంలు పాలించిన తెలంగాణ ప్రాంతంలో 1922 వరకు తెలుగు పత్రికలు ప్రారంభం కాలేదు. హైదరాబాద్ నగరం నుంచి 19వ శతాబ్దంలో వెలువడిన కొన్ని ఆంగ్ల, ఉర్దూ పత్రికలపై నిజాం ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించింది. బ్రిటిష్ పాలకులకు, నిజాం ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే రాతలు ఆ కాలంలో రాయకూడదు. అప్పట్లో ప్రచురితమైన తెలుగు పత్రికలు అనేక నిర్బంధాలకు గురయ్యాయి. ఆంధ్రా ప్రాంతంలో అదే సమయంలో నాటి బందరు నేటి మచిలీపట్నం నుంచి కృష్ణా పత్రిక వెలువడుతుం డేది. ఒద్దిరాజు సోదరులు బందరు వెళ్లి మట్నూరి కృష్ణారావును కలిసి తాము కూడా పత్రిక స్థాపిస్తే ఎలా ఉంటుందని, ఇనుగుర్తి గ్రామంలో స్థాపించేందుకు సలహా ఇవ్వాలని కోరడంతో కృష్ణారావు దానికి బాగుంటుందని సలహా ఇచ్చారు. ఒద్దిరాజు సోదరులు ఇనుగుర్తి సొంత గ్రామంలో పత్రికను నడిపేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో నిర్బంధ కాలంలోనే తెలంగాణ ప్రజలను మెల్కోల్పేందుకు ఒద్దిరాజు సోదరులు తెనుగు పత్రికకు శ్రీకారం చుట్టారు. 1922 ఆగస్టు 28న ఈపత్రికను ప్రారంభించారు. పత్రిక ముద్రణకు కావాల్సిన రూ.6వేల విలువైన వార్‌ఫెడిల్ మిషన్, ట్రెడిల్ మిషన్ ఖరీదుచేసి సొంతంగా విజ్ఞాన ప్రచారిణి అనే ముద్రణాలయాన్ని స్థాపించి తెనుగు పత్రిక (వారపత్రిక)గా నడిపించారు.

ప్రజలే చైతన్యంగా..

పత్రికను స్థాపించిన ఒద్దిరాజు సోదరులకు పత్రికను వివిధ గ్రామాలు, పట్టణాలు, రాష్ట్రాలకు పంపించేందుకు సమస్యగా మారింది. వారానికి రెండ్రోజులు మాత్రమే వెలువడే ఈ తెనుగు పత్రికను నిజాం నిరంకుశ ప్రభుత్వ పాలన కింద సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేయబడుతున్న తెలంగాణ ప్రజలను మెల్కోలిపే వార్తలను ఒద్దిరాజు సోదరులు ప్రచురించే వారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఇలాంటి వార్తలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. అలాంటి వార్తల పత్రికను ఇనుగుర్తిలో పోస్టాఫీస్ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు తరలించే వీలు లేకుండాపోయింది. దాంతో ఒద్దిరాజు సోదరులు హైదరాబాద్‌కు వెళ్లి పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులను కలిసి గ్రామానికి పోస్టాఫీసును మంజూరు చేయించారు. పత్రికకు వార్తలు, వ్యాసాలు రాసేందుకు, చందాదారులుగా చేర్పించడానికి, చేరడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వారే స్వయంగా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సూర్యాపేట, విజయవాడ, బందరు, చెన్నై, మానుకోట ప్రాంతాల్లో తిరిగి సంవత్సరం చందా దారులను తయారు చేసి పోస్టాఫీసు ద్వారా పత్రికను చేరవేసేవారు. నాటి కాలంలో ఆ పత్రికకు సంవత్సరపు చందా మూడు రూపాయలే. వారానికి 500 కాపీలను ముద్రించి పోస్టు ద్వార చందాదారులకు పంపేవారు. ఈ పత్రికకు మంచి స్పందన రావడం తో హైదరాబాద్ నుంచి బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, వెంకటేశ్వర్‌రావు, కోదాటి రామకృష్ణారావు లాంటి ప్రముఖులు కూడ ఈ తెనుగు పత్రికకు వార్తలు పంపడం విశేషం.

ప్రముఖుల వ్యాసాలు..

ఒద్దిరాజు సోదరుల బంధువైన నల్గొండకు చెందిన షబ్నాలిస్ వెంకటనర్సింహారావు ఒద్దిరాజు సోదరుల సలహాతో 1923లో నల్గొండలో 'నీలగిరి' అనేక పత్రికను స్థాపించారు. ఏడాది పాటు ఇనుగుర్తిలోనే వద్దిరాజు సోదరుల ప్రింటింగ్ ప్రెస్‌లో ఆ పత్రిక ప్రింటింగ్ చేసి నల్గొండకు పంపించేవారు. అయితే రజాకార్ల సమయంలో బహుముఖ కవి, రచయితలు కావడంచేత అనేక గ్రంథాలు రాశారు. ఒద్దిరాజు సోదరులు రాసిన చాలా గ్రంథాల్లో కొన్నింటిని ప్రచురించగా, చాలా వరకు ప్రచురించలేకపోయారు. చేతివృత్తులపై వారు రాసిన అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ సోదరులు రాసిన సౌదామిని పరిణయం అనే గ్రంథం నుంచి కొంత భాగాన్ని కాకతీయ యూనివర్సిటీ కూడా సేకరించి దాన్ని పాఠ్యాంశంగా మార్చి విద్యార్థులకు బోధన చేశారు. రజాకార్లు ఇనుగుర్తిలోని ఒద్దిరాజు సోదరుల ఇంటికి వెళ్లి వారు రాసిన అనేక గ్రంథాలను తగలబెట్టడంతో పాటు విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒద్దిరాజు సోదరులు ఆ తర్వాత పత్రికను వరంగల్ జిల్లా కేంద్రానికి మార్చారు. అయితే కొన్ని నెలల వరకే పత్రిక నడిచి పలు కారణాలతో ప్రచురణ ఆగిపోయింది. పత్రిక నిలిచి పోయింది. కాగా, ఒద్దిరాజు సోదరులు నివసించిన, పత్రిక నిర్వహించిన భవనం ప్రస్తుతం ఎవరూ లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తెలంగాణలో మొట్టమొదటి తెలుగు భాషలో వెలువడిన తెనుగు పత్రిక స్థాపించిన ఈ భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

27న ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు..

ఇనుగుర్తి గ్రామానికి చెందిన ఒద్దిరాజు సీతారామచందర్ రావు, రాఘవ రంగారావు కలిసి తెలంగాణలో తెనుగు పత్రికను స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న ఇనుగుర్తి రైతు వేదికలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఒద్దిరాజు సుభాష్ తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖ పాత్రికేయులు, ఒక దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులకు కూడా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయుల సంఘాల బాధ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాజర్నలిస్టులు పాల్గొని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

గిర్మాజిపేట, ఆగస్టు 25: సికింద్రాబాద్ నుంచి వరంగల్ వస్తున్న రైలు నుంచి జారి పడి మహిళ మృతిచెందిన ఘటన హంటర్ రోడ్డు శాయంపేట రైల్వేగేటు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ కథనం ప్రకారం. హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన సాదియా(42) 4 నెలలుగా సికింద్రాబాద్ లాలాగూడలో కుమారుడు సల్మాన్, కూతురు సల్మాతో ఉంటోంది. ఆదివారం తెల్లవారుజామున సికిందరాబాద్ నుంచి వరంగల్‌కు రైల్లో వస్తున్న సాదియా శాయంపేట రైల్వేగేటు వద్ద రైలు నుంచి జారి పట్టాలపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా సాదియాగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి, ఎంజీఎం మార్చురీకి తరలించారు. సాయంత్రం మృతదేహాన్ని లష్కర్‌బజార్‌లోని మృతురాలి తల్లి రహమున్నీసా బేగంకు అప్పగించి ఎస్సై మోహినుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరులో తెలుగు రచయితల మహాసభలు

జనగామ కల్చరల్, ఆగస్టు 25: ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు డిసెంబరు 28, 29 తేదీలలో విజయవాడలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం, విజయవాడలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తు న్నారు. ప్రపంచ తెలుగు మహాసభల స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ మహాసభలలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులు, సాహితీ ప్రముఖులందరూ తప్పక పాల్గొనవలసిందిగా ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ మహాసభలలో వివిధ అంశాలపై ప్రసంగాలు, సదస్సులు, కవి సమ్మేళనాలు, ఎంపిక చేసిన 100 మంది యువకవులతో 'ఆలపిస్తాం హాయిగా' ప్రత్యేక కవితా వైభవ సభ, ఎన్నో ఇతర సాహితీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మహాసభలలో రచయితలు, విద్యార్థులు కూడా ప్రతినిధులుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పాల్గొనే ఔత్సాహిక విద్యార్థులైన కవులకు ఉచిత భోజనంతో పాటు ఉపహారం రెండు రోజుల పాటు కల్పిస్తారని, ప్రయాణ ఖర్చులు, వసతి సౌకర్యాలు ఎవరికి వారే భరించాలని తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలకు 93912 38390 నంబరులో సంప్రదించాలన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల అసోసియేషన్ ఎన్నిక

లింగాలఘణపురం, ఆగస్టు 25: తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ లింగాలఘణపురం మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కళ్లెం హెచ్‌ఎం పాశికంటి యాదగిరి ఎన్నికయ్యారు. టీజీహెచ్‌ఎంఏ జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రభాను ఆధ్వర్యంలో జరిగిన మండల శాఖ ఎన్నికలకు లింగాలఘణపురం హెచ్‌ఎం మల్లికార్జున్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. మండలశాఖ ప్రధాన కార్యదర్శిగా కుందారం హెచ్‌ఎం బిట్ల రవిశంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి ఐక్యంగా పాటుపడుతామని అన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక..

రఘునాథపల్లి, ఆగస్టు 25: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కమిటీ రాష్ట్ర కౌన్సిలర్ కుర్రేముల యాదగిరి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.ఎన్ రాజుల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బాల్నె నాగభూషణం, ప్రధానకార్యదర్శిగా జి. లచ్చిరాం, ఉపాధ్యక్షులుగా రామ్‌మోహన్, వెంకట్రాజయ్య, సారయ్యలు, మహిళా ఉపాధ్యక్షురాలిగా కవిత, కార్యదర్శులుగా మల్లేశం, రాజేందర్, యాకయ్య, కలింగం, జిల్లా కౌన్సిలర్‌లుగా సత్యనారాయణ, సంపత్, కార్యవర్గ సభ్యులుగా నరేష్, మూరుతి ప్రసాద్, సీతారామ్, సలహాదారులుగా ఉపేందర్, రాజహన్మంతారెడ్డి, సత్యనారాయణ, శోభన్‌బాబులను ఎన్నుకున్నారు.

పాలకుర్తి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక..

పాలకుర్తి, ఆగస్టు 25 : ప్రెస్‌క్లబ్ ఆఫ్ పాలకుర్తి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు కలిసి ఈ కమిటీని ఎన్నుకున్నారు. క్లబ్ గౌరవాధ్యక్షుడుగా చిట్యాల యాకయ్య (ఆంధ్రజ్యోతి) ఎన్నిక కాగా, అధ్యక్షుడుగా గుగులోతు దేవోజీ (నవ తెలంగాణ) ప్రధాన కార్యదర్శిగా యాకూబ్ పాషా (ఏబీఎన్ ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా జిలుకర తిరుమల్ (వెలుగు) ఉపాధ్యక్షులుగా చిదురాల ఎల్లయ్య, (మన ప్రగతి) కొండపర్తి విష్ణుమూర్తి (సాక్షి టీవీ) వర్ధమాన్ శ్రీనివాస్ (టీవీ 5) సహాయ కార్యదర్శులుగా నలేంద్ర సోమన్న (జనం సాక్షి), బొమ్మగాని ప్రదీప్ (టీ న్యూస్) కత్తుల యాకయ్య (ప్రజాపక్షం), సలహా సభ్యులుగా రాపోలు రాంబాబు, దాసరి యాకయ్య, గుడికందుల నరేష్, గజ్జి రాజు, మామిండ్ల సోమయ్య, బాలగాని రమేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కత్తుల యాకయ్య తెలిపారు.



శామిర్‌పేటలో పెద్దమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



బచ్చన్నపేటలో బోనాలతో తరలివెళుతున్న మహిళలు



సీతారాంపురంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

జిల్లాలో ఘనంగా బోనాల జాతర

గ్రామదేవతలకు మొక్కులు చెల్లించిన మహిళలు ● భక్తులతో సందడిగా మారిన ఆలయాలు

జనగామ కల్చరల్, ఆగస్టు 25: శ్రావణమాసం చివరి ఆదివారం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోచమ్మ దేవాలయంలో తొలత విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించగా అనంతరం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కలకాలం నిండు సౌభాగ్యవతిగా ఉండాలని మహిళలు కోరుకున్నారు. అనంతరం ప్రతి బోనం నుంచి నైవేద్యాన్ని అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారోజు రామేశ్వరాచారి, కాలూరి మల్లికార్జునాచారి, దీగోజు నర్సింహాచారి, బైరోజు సంతోష్‌చారి పాల్గొన్నారు.

దేవరుప్పుల: దేవరుప్పులతో పాటు సీతారాంపురం తదితర గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే కల్లాపు చల్లి బోనం కుండలు తెచ్చుకుని పసుపు, కుంకుమలతో అలంకరించారు. కుండలలో నైవేద్యం వండుకుని వేప ఆకులు అందులో ఉంచి దీపం పెట్టుకుని గ్రామ దేవతలకు టెంకాయలు సమర్పించుకున్నారు. ముక్కులు తీర్చుకుని బోనాలతో బొడ్రాయి వద్దకు చేరుకుని పోచమ్మ ఆలయం వద్ద బోనాలను సమర్పించుకున్నారు.

లింగాలఘణపురం: మండలంలో ఆదివారం ఊరూరా శ్రావణమాసం సందర్భంగా బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మ, కులదైవాలు బీరప్ప, కాటమయ్య, మార్కండేయ స్వామిలకు బోనాల ద్వారా నైవేద్యం సమర్పించేందుకు మహిళలు భారీ ర్యాలీతో డప్పుచప్పులతో బయలుదేరారు. ఊరూరా సాంప్రదాయపు బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

జనగామ రూరల్: మండలంలోని శామిర్‌పేట గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పు చప్పుళ్లతో దేవాలయానికి బయల్దేరి అమ్మవారికి బోనాలు సమర్పించారు. తమ కుటుంబాలు చల్లగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ బోనాల పర్వదిన వేడుకల్లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ నిమ్మల స్వామి, సొసైటీ సభ్యులు గువ్వల ఉప్పలయ్య, నిమ్మల మధు, గుర్రాల నరేష్, కొలిపాక సురేష్, ఏదు నర్సింగరావు, ముదిరాజ్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల జాతర సాగింది. గ్రామదేవతలైన పోచమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ, రేణుకామాత, మాతమ్మలకు పూజలు నిర్వహించి, తమ కుటుంబ సభ్యులను చల్లగా చూడాలంటూ వేడుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తులు పూనకాలతో ఊగిపోతుండగా, ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో బీరప్ప బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామ శివారులోని ఆలయం వద్దకు ర్యాలీగా బయలుదేరారు. శివసత్తుల పూనకాలు, ఒగ్గుడోలు వాయిద్యాలతో, డీజే పాటల మధ్య భక్తిపరవశ్యంతో నృత్యాలు చేసుకుంటూ ఆలయం వద్దకు వెళ్లి బీరప్ప-కామరాతిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యాకయ్య, ఒగ్గు రాజు, పొన్న బీరయ్య, పొన్న పరుశరాములు, ఒగ్గు లింగయ్య, పొన్న గట్టయ్య, పొన్న మల్లయ్య, శంకర్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



జనగామ పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



వడ్డిచర్లలో బోనాలతో వెళ్తున్న పద్మశాలి మహిళలు



పాంనూర్‌లో బీరప్ప ఆలయం వద్ద బోనాలతో మహిళలు

ఆకేరువాగుపై బ్రిడ్జి నిర్మించాలి

● ఎమ్మెల్యే కడియంను కోరిన నష్కల్ గ్రామస్థులు

చిలుపూర్, ఆగస్టు 25: మండలంలోని నష్కల్ సమీపంలో ఉన్న ఆకేరువాగుపై బ్రిడ్జి (హై లెవల్ వంతెన) నిర్మించాలని కోరుతూ పలువురు నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న -వెంకటేశ్ నేతృత్వంలో పలువురు నాయకులు ఆదివారం హన్మకొండలో కడియంను కలిసి సమస్యను విన్నవించారు. నష్కల్ రెవెన్యూ పరిధిలో ఉన్న 60శాతం రైతాంగానికి ఆకేరువాగు అవతలి వైపే వ్యవసాయ భూములు ఉన్నాయని, వర్షాకాలంలో పొలాలకు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా స్థానిక ఎస్సీ శ్మశానవాటిక (క్రైస్తవ సమాధుల ఏరియా)కు ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోడెం స్వామి, వంగాల భాస్కర్‌రెడ్డి, మోడెం భిక్షపతి, కూరపాటి సాంబయ్య, నాగులు, శాతబోయిన రాజు, మోడెం వేమన, మాజీ సర్పంచ్ కోరుకొప్పుల అశోక్, యాదగిరి, కాశయ్య, ఆరోగ్యం, శ్యాంసుందర్, సంతోష్, కర్ణకంటి శ్రీహరి, మల్లయ్య పాల్గొన్నారు.



నష్కల్ గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు

జనగామ కల్చరల్, ఆగస్టు 25: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జనగామలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ఉద్యోగులకు భద్రత, పెన్షన్, గ్రాట్యుటీ మొదలైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. 1990 నుంచి అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల నేడు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ నియామకాలు, సీపీఎస్ లాంటివి అమలవుతున్నాయన్నారు. ఏది ఏమైనా సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేసే వరకు పోరాటాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కృష్ణ, వెంకట్, శ్రీహరి, యాదవరెడ్డి, కృష్ణమూర్తి, కనకయ్య, శ్రీనివాస్, శ్రీధర్, నాగరాజు, ఉప్పలయ్య, ఆగయ్య, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పంచరాయి భూములను పేదలకు అందించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్

జనగామ కల్చరల్, ఆగస్టు 25: ప్రభుత్వ పంచరాయి భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళపల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా మండల గట్టుమల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ నెల 3,4 తేదీలలో వేములవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల నిర్ణయాలను వివరిస్తూ సెప్టెంబర్ 5న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పంచరాయి భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పిట్టల కుమారస్వామి, నకీర్త రాములు, బంటు పాండు, దండుగుల అయిలయ్య, బోళ్ల యాదగిరి, సీతారాం నాయక్, వెంకట్‌రెడ్డి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంగళపల్లి జనార్దన్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సాయిప్రసన్న (ఫైల్)

చిలుపూర్, ఆగస్టు 25: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. చిలుపూర్ ఏఎస్సై జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి సాయిప్రసన్న (18) అనే యువకుడు శనివారం రాత్రి కరుణాపురం నుంచి ధర్మాపురంనకు బైక్‌పై వెళ్తూ చిలుపూర్ మండలం వంగాలపల్లి రైల్వేగేటు అవతల పౌల్ట్రీ ఫాం సమీపంలో అదుపు తప్పి పక్కనున్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సాయి ప్రసన్నను కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. తల్లి మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

మండల్ యాదవ్ సేవలు మరువలేనివి



చిన్నపెండ్యాలలో నివాళి అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి గంటె ఉపేందర్ యాదవ్

చిలుపూర్, ఆగస్టు 25 : బీసీల రిజర్వేషన్ల సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన బీపీ మండల్ యాదవ్ సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి గంటె ఉపేందర్ యాదవ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని చిన్నపెండ్యాలలో మండల్ యాదవ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల దేవేందర్, ఇల్లందుల సుదర్శన్, బత్తుల రాజన్‌బాబు, ముక్కెర శ్రవన్, అశోక్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



కూనూరులో ఉపాధ్యాయులతో 1999-2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



చిన్నపెండ్యాలలో సమావేశమైన 1993 -94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

జఫర్‌గడ్, ఆగస్టు 25: మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1999-2000 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా ఒకచోట చేరి నాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు దేవేందర్, కొండల్‌రెడ్డి, యాదగిరి, వెంకటస్వామిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిరబోయిన శ్రీనివాస్, సిహెచ్, నాగరాజు, మూల క్రాంతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శాస్త్రబోయిన సంపత్, ఓరుగంటి సురేశ్, కుంట అశోక్, ఈదులకంటి లింగారెడ్డి, రూపిరెడ్డి జ్యోతి, దండు జ్యోతి, యాదనాల రజిత, రడపాక రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు భూక్య సుధాకర్ నాయక్, తాళ్లపల్లి బాబుగౌడ్, శివకుమార్‌ల నేతృత్వంలో జరిగిన సమ్మేళనానికి 1993-94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు వేణు ఆనంద్, వెంగల్‌రెడ్డి, రాధిక, సంపత్ తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం రవి, తాళ్లపల్లి కృష్ణ, పేరాల రమేష్, పూజారి రాజమోహన్, గంటె ఉపేందర్, గద్దె మధుకర్, పేరాల రాజన్‌బాబు, ఇల్లందుల యాదగిరి, పుల్యాల రాజు, చుక్క అనిల్, మాచెర్ల యాదగిరి, నంగునూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక పెన్షనర్ల ఇబ్బందులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 25: ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో రాక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఇ.ఇంద్రసేనా రెడ్డి, విజేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు ఇక్కడ మాట్లాడుతూ జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు రిటైర్ అయిన ఆరు నెలల నుంచి ఏడాది కావస్తున్నా రావడం లేదని చెబుతున్నారు. నెల నెలా పొదుపు చేసుకుని దాచుకున్న ఈ డబ్బులను రిటైర్ అయిన వెంటనే ఇవ్వాల్సి ఉండగా తీవ్ర జాప్యం చేస్తుండడం పట్ల ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఉద్యోగులు తమ సర్వీస్ కాలంలో వారు పొందే వేతనం నుండి నెల నెలా కొంత మొత్తం పిల్లల చదువులు, పెళ్లిళ్ల, తదితర అవసరాల కోసం పొదుపు చేసుకున్న డబ్బులు గత మూడు నాలుగేళ్లుగా సరిగా రావడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రిటైర్ కాని ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బిల్లులు కూడా రెండు, మూడేళ్లుగా మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'ధర్నాను జయప్రదం చేయాలి'

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 25: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 3వ తేదీన చేపట్టిన హలో ట్రాక్‌మెన్-చలో సికింద్రాబాద్ ధర్నాను జయప్రదం చేయాలని రైల్వే ఇంజనీరింగ్ బ్రాంచ్ కాజీపేట సెక్రటరి ఇల్లెందుల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కార్మికులను కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం చేబడుతున్న ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైల్వేశాఖ 8వ వేతనం పైన వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కరోనా సమయంలో ఆగిన 18 నెలల డీఏను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, చిలుక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు అందించిన దాత

బచ్చన్నపేట, ఆగస్టు 25: గ్రామంలోని వీధులు చీకట్లో మగ్గిపోతుండగా ప్రజల ఇబ్బందులు గుర్తించిన మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు కోడూరి శివకుమార్‌గౌడ్ వీధిలైట్లు కొనుగోలు చేసి జీపీ సిబ్బందికి అందించారు. గతంలో వీధి దీపాల మెయింటనెన్స్‌ను జిల్లాకు చెందిన కాంట్రాక్టర్లు చూసుకునేవారని, ప్రస్తుతం ఆబల్బులు పనికి రాకుండా పోవటంతో ఎవరూ పట్టించుకోవటం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేయగా శివకుమార్ స్పందించారు. ప్రస్తుతం శ్రావణమాసం బోనాల సీజన్ కావటంతో దాత ఇచ్చిన సహకారం మరువలేదని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎలికట్టె శ్రీనివాస్, కందుకూరి నవీన్‌గౌడ్, పిట్టల బాల్‌రాజు, సంతోష్‌రెడ్డి, రామయ్య, శ్రీనివాస్, సిద్దులు, దాసు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొడకండ్ల, ఆగస్టు 25: మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 10మందిని అరెస్ట్ చేశారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, కొడకండ్ల ఏఎస్సై కత్తి రమేష్ సిబ్బందితో దాడి చేసి వారి వద్ద రూ.26,760 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పేకాట రాయుళ్లు కున్సోత్ కిషన్, బాషిపాక నర్సింహస్వామి, ఎరకల శ్రీనివాస్, చెవిటి జాషువా, మద్దూరి ఉమేష్, మేకల రవి, యాట వెంకన్న, పిట్టల శ్రీను, నారగోని సోమయ్య, గుగులోతు కిషన్‌లను అరెస్ట్ చేసినట్టు ఏఎస్సై రమేష్ వెల్లడించారు.

పథకాలపై ప్రచారం చేయాలి

సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు

జఫర్‌గడ్, ఆగస్టు 25 : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్యారంటీ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు యువజన కాంగ్రెస్ శ్రేణులను కోరారు. యూత్ కాంగ్రెస్ ప్రతినిధుల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో భాగంగా ఆదివారం మండలంలోని ముగ్దుంతండాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కరుణాకర్‌రావు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య భూమిక పోషించాలన్నారు. పార్టీ కార్యక్రమాల సక్సెస్‌కు యువజన కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో పని చేయాలన్నారు. కాగా, సోషల్ మీడియా వేదికగా జరిగే ఈ ఎన్నికల నేపథ్యంలో మండలం నుంచి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పోటీలో ఉన్న తాటికాయల రాజేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవికి పోటీలో ఉన్న ఎం.ఉదయ్‌కుమార్‌ను బలపరుస్తూ అధిక మెజార్టీతో గెలిపించాలని యువజన సభ్యులను కోరారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నీరజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు స్వామినాయక్, వి.శంకర్‌నాయక్, కుమారస్వామి, వంగాల దయాకర్, కె.కుమారస్వామి, దేవానాయక్, తదితర నాయకులు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.